# 'అ' అనే అక్షరానికి మకుటం పెట్టిన తొలి మాతృభాష మనది.

## - గ్రామాల్లో ఉండే తెలుగు పిల్లల ఏడుపులో కూడా మార్పు వచ్చింది! -



పసిపిల్లలుగానీ, పసితనం వాడిన పిల్లలుగానీ – ఆకలి వేసినప్పుడు గానీ, ఏదైనా కావాలని కోరిక కలిగినప్పుడు గానీ, బాధ వచ్చినప్పుడు గాని (పెద్దలు వాళ్ళు సహితమూ) 'అమ్మా' 'అమ్మా' అని, మమతగొలిపేట్టు మాతృభాషలో ఏడ్చేవారు. ఇప్పుడు ఇక్కడా పరిస్థితి మారిపోయింది. 'మమ్మీ', 'మమ్మీ' అని ఏడవడం ఆశ్చర్యం కలిగించింది. 'అమ్మ' వాత్సల్యం ఒలకపోసే అమృతమయి కదా! 'మమ్మీ' పిలుపు మృతప్రాయమైన 'దెయ్యం' పేరని పెద్దలయినా చెప్పరు. (చెప్పడానికి వారికి తెలియదేమో! లేదా అమ్మ బాబోయ్ నా బిడ్డ అన్నప్రాసన రోజున ఆవకాయ తిన్నట్టు ఇంగ్లీషులో పిలుస్తున్నాడని సంబరమందుతున్నారో!)

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

ఇహ 'అమ్మ' అందు బాటులో లేనప్పుడు 'నాన్నా' అని ఆప్యాయంగా పిలిచేవారు. ఇప్పుడదీ మానేసి 'డాడీ' యని పిలవడం ప్రారంభించారు. పిన్ని గారు, బాబాయిగారి పేరు లెప్పుడో పోయాయి, ఆంటీ అంకుల్ – ఇది పిన్నికీ అత్తకూ, బాబాయికీ, మావయ్యకూ, ప్రక్కింటావిడికీ, ప్రక్కింటాయ నకూ కూడా వర్తిస్తుంది.

పొలాలూ, తోటలూ, పెరటుల్లో ఉన్న ఆవుదూడ, గేదె దూడ, మేకపిల్లల్ను చూసాను. అవి 'అంబా' అంబా', 'మేఎఏమే' యని వాటి మాతృభాషలోని తల్లుల్ని పిలుస్తున్నాయ్. యుగాలు మారినా, పక్ష్యాదులు వాటి భాషను మార్చలేదు. ఈ మనుషులు కన్నా అవెంత మాతృభాషాప్రియులో! గడ్డిగాదములు తినేవే యైనా సాంప్రదాయంగా గుణాన్ని మానలేదు. వాటి తిండిలో కూడా మార్పులేదు. ఫ్రైడురైసూ, బిరియానీలు తినవు. మనమా...? మళ్ళీ చెప్పుకుందాం. ●

---

(15వ పేజీ తరువాయి)

ఎర్రగానూ, దోసిట నుంచి పోసేటప్పుడవి తెల్లగానూ, ఆయన ఒంటి మీద పడినప్పుడు ఇంద్రనీలం వర్ణంలోనూ ఉన్నాయ్ కదమ్మా! నీవు పోసినపుడెంత మనోహరంగా ఉన్నాయో! రాముడు పోసినప్పుడు నీ సిగ్గు దొంతర్లే తక్క ఎలా ఉన్నాయో తెలియలేదు అంటూ ఆ సీతారాములపైననే వచ్చిన భక్తకోటి, పైన ముక్కోటి దేవతలూ చూస్తూనే ఉంటారు. అలా అంత వైభవంగా కల్యాణం జరగాలనేమో భక్తజనులందరూ తమతమ సంతానపు కల్యాణపత్రికలో తప్పకుండా ఈ శ్లోకాన్ని ముద్రిస్తారు. కొన్ని కోట్ల శుభలేఖలపై ఈ శ్లోకం అచ్చయి ఉంటుంది. రామయ్య అన్నా, సీతమ్మ తల్లి అన్నా భారతీయుల కంత అవ్యాజమైన ప్రేమభక్తీ! రామో విగ్రహాన్ ధర్మ అన్నారు. అమ్మా! సీతమ్మలక్ష్మి నీవేఁమి తక్కువ 'సీతాయాశ్చరితం మహత్' అన్నాడు కదమ్మా నిను వాల్మీకి

**రామా! విశాల విక్రమ రామా। పరాజిత భార్గవరామ ! సద్గుణ**
**స్తోమ। పరాంగణా విముఖ సువ్రతకామ వినీలనీరద**
**శ్యామ। కాకుత్స వంశ కల శాంబుధిసోమ। సురారిదోర్బలో**
**ద్ధామ। విరామ। భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ।**

భద్రగిరీశా! రామా! దయాసాగరుడవు అయిన దాశరథీ శ్రీరామా! నీ పరాక్రమముచే పరశురాముణ్ణి పరాజయుణ్ణి చేసితివి. సుగుణాల గుణ గనివి। ఏకపత్నీవ్రతుడవు. మేఘము వంటి ఛాయగల నీవు కాకుత్స వంశమనే పాల సముద్రమున చంద్రునిలా జన్మించావు. రాక్షసుల బలసంపదను భంగపరచినవాడవు దాశరథీ! నీవు అపార కరుణామూర్తివి.

### భద్రాద్రి ఎందుకు దర్శించాలి

కలియుగమున వెలసిన శ్రీరాముని వైకుంఠధామం భద్రాద్రి. భక్తుల అభీష్టమును సిద్ధింపచేసే సీతాలక్ష్మణ సమేత శ్రీరాముడు చతుర్భుజుడై, శంఖు చక్ర ధనుర్బాణములతో వెలసిన పుణ్యప్రదేశం. రామావతారంలోని వనవాస సందర్భములో ఆయన ఎక్కువ కాలం ఈ గౌతమీ తీరంలోనే వసించాడు. సీతారామ లక్ష్మణులతో ఉన్న పర్ణశాల ఆదిగాగల రామసంచార ప్రదేశమంతా ఇదే! వారు దండకారణ్యమున వనవాసం జరిపిన సందర్భంలో ఓ గిరిశిల విశ్రాంతి స్థలమై వారినెంతగానో ఆకట్టుకున్నది! ఆ గిరిశిలయే బ్రహ్మదేవుని వరప్రసాదముగా మేరుదేవీ మేరు పర్వత రాజు దంపతులకు భద్రుడను పేరిట జన్మించాడు. శ్రీరామభక్తుడైన ఆ భద్రుడు నారదమహర్షిచే తారకమంత్రోపదేశం పొంది తీవ్రమైన తపస్సు చేశాడు.

భద్రుని తపఃప్రభావం కారణంగా శ్రీమహావిష్ణువు మరల శ్రీరాముని రూపము దాల్చగా, మహాలక్ష్మి సీత రూపం ధరించింది. శేషుడు లక్ష్మణ రూపమును ధరించాడు. ఈసారి శ్రీరాముడు చతుర్భుజుడై శంఖుచక్ర ధనుర్బాణములు ధరించి, వామాంకమున సీతాదేవిని కూర్చుండపెట్టుకుని, వామపార్శ్వమున లక్ష్మణునితో కుడి పద్మాసనునిగా ప్రత్యక్షమై, భద్రుని తపస్సుకు మెచ్చి వరం కోరుకోమన్నాడు. భద్రుడు నాకేఁ వరము వలదు. నీవు దర్శనమిచ్చినట్లుగానే గిరిరూపం దాల్చినా శిఖరాగ్రమున వెలసి ఉండాలి. రామచంద్రుని ప్రార్థించగా, శ్రీరాముడు అనుగ్రహించి, భద్రుని శిఖరాగ్రంపై వెలసెను. ఇక్కడి సీతారామలక్ష్మణులు 'అ' కార 'ఉ' కార 'మ' కార స్వరూపులైనందున, 'ఓంకారరాముడు' అనీ శంఖుచక్ర ధనుర్బాణములు ధరించుటచే రామనారాయణుడనీ భద్రాచలమున వెలయుటచే భద్రగిరీశుడైన భద్రాచలరాముడనీ పేరొందాడు. 16వ శతాబ్దానికి చెందిన పోకలదమ్మక్క భద్రగిరిపై వెలసిన సీతారామలక్ష్మణుల విగ్రహాలకు ఎండవానలు తగలకుండా తాటియాకులతో పందిరి వేసి, తాటిపండ్లనే నివేదనం చేస్తూ, 'అపర శబరి'యనే కీర్తిని పొందింది. నేలకొండపల్లి వాస్తవ్యుడైన కంచర్ల గోపన్న యిక్కడకు తహసిల్దారుగా రావడం, భద్రగిరీశుని భక్తుడై, రామునికి ఆలయం, గోపురములు, ప్రహరీ నిర్మించడమే గాకుండా సీతారామలక్ష్మణులకు బంగారు ఆభరణాలు చేయించడం, ఇందుకోసమై పన్నుల రూపంగా వచ్చిన పన్నుల ధనాన్ని వినియోగించడంతో గోల్కొండ రాజైన తానీషా అతనికి చెరసాల శిక్ష విధించాడు. ప్రహ్లాదుని హిరణ్యకశిపుడు శిక్షించిన విధంగా అనేక కఠిన శిక్షలు విధించడంతో 'అబ్బ దెబ్బల కోర్వలేనయ్యా' అను పలు సంకీర్తనములను రామచంద్రునిపై వ్రాసి, రామకటాక్షం పొందాడు, సాక్షాత్తూ రామలక్ష్మణులను తానీషాకు రామోజీ, లక్ష్మోజీగా దర్శనమిచ్చి రామదాసు వెచ్చించిన ధనమంతా చెల్లించడంతో గోపన్న చెర నుంచీ విడుదల కావడమే గాకుండా, తానీషా అచ్చెరువొంది ఆలయానికి నిధులూ, అగ్రహారములిచ్చి, రామకల్యాణానికి ప్రతీ యేటా పట్టువస్త్రములు, ముత్యాల తలంబ్రాలు పంపించే ఆనవాయితీని యిప్పటి ఆంధ్రప్రభుత్వం కూడా కొనసాగిస్తూన్నది. రామకల్యాణంజరిగిన మరుసటిరోజున శ్రీరామపట్టాభిషేకం జరుపడం భద్రాచల ఆచారం. పాటింపబడుతూంది! జై భద్రాద్రి రఘురామ్. ●

మలేషియా తెలుగు అభిమాని లేఖ

తేది : 10-4-2012

శ్రీరాములు గోపిశెట్టి,

# ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను?

## తెలుగుతల్లి పుత్రుడు శ్రీ గోటేటి శ్రీరామారావుగారికి

**ఓ ప్రియ అన్నయ్యా,** ప్రేమ స్వరూపా! తొలి తెలుగు మ్రొక్కులు అందజేస్తున్నాను.

తమను 2002వ ఏడున సింగపూరులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో చూచాను. ఎంతోమంది తమను చాలా అత్యున్నతంగా మర్యాదతో మాట్లాడ్డం తమ ప్రక్కనే యుండి గమనించాను. తమ చిరునవ్వు ముఖారవిందం, నిరాడంబరతను, తఅచు అందఱితో తెలుగమ్మను గురించి మాట్లాడం కూడా గమనించాను. ప్రముఖాంధ్ర పత్రికను పుట్టించి, దానిని సరైన బాటలో నడిపించే సేవకుడవని తెలుసుకోలేదు. తమను సభకు వచ్చిన పలువురు పొగడే పొగడ్తలు ఇంకా నా మనస్సులో కదలుతున్నాయి. అయితే తమతో స్వయంగా పరిచయం చేసుకొని మాట్లాడుటకు వీలు కల్గలేదు. ఇప్పుడు, అందుకు చాలా విచారంగా వుంది.

నేను మా ఇంటికి వెళ్ళిన తర్వాత కొన్ని నెలలు సింగపూరు సభకు వచ్చిన వారికిచ్చిన సంచిన తెఱచి చూడలేదు. ఒకనాడు దాన్ని తెఱచి పరిశీలించిన తర్వాత అందులోయున్న ఒక ప్రముఖాంధ్ర సంచికను చూసాను. దాన్ని చదువనారంభించి అంతా చదివిన తర్వాత, ఆ పత్రికలో తమ పటాన్ని చూచాను. అప్పుడే తెలుసుకున్నాను; సభలో తెలుగు ప్రియులు ఎందుకు మిమ్ములను పొగిడినారాయని? అప్పటినుండి తమ ప్రేమ ముఖం నా మనస్సున నిలకడయింది. ఎందుకంటే తెలుగుతల్లి సేవకై తమ బ్రతుకునే అర్పించుకొన్న తమబోటి తెలుగువారందఱు నీ తోబుట్టువులే!

**ఓ తెలుగు స్వరూపా!** 2004 ఏప్రిల్ నెల సంచికను నిన్నను ఒక మిత్రుడు ఇచ్చాడు. అందులో తమ ఒడలు అనారోగ్యానికి గురైందని గమనించాను. వెంటనే ఈ జాబు మూలంగానైనా తమను కలవాలన్నా ఆత్రుత కల్గింది, వ్రాసాను.

**ఓ తెలుగయ్యా!** తాము తెలుగు తల్లి వరపుత్రుడవు మీవంటి తెలుగు ప్రేమికులు, తెలుగుతల్లి వికాసానికి సేవ జేయ పూనుకున్న తెలుగువారు చాలా తక్కువ. పదికోట్లకు పైగా ప్రపంచంలో తెలుగువారున్నారుగాని, తమవంటి తెలుగు సేవ చేయువారు ఇప్పుడు తమరొక్కరే. మీవంటి (ఒకరు) ఆరోగ్యము కుదుటపడలేదంటే నాకు ఇంతంతగాదు, అంతులేని విచారముగా యుంది. నా ఊపిరి ఆగినంత కలత నొందాను.

**ఓ తెలుగన్నయ్యా,** తమరు చాలాకాలం కలకాలం, దీర్ఘాయుష్షుతోను, ఆరోగ్యవంతంగాను, ఏ ఒడుదుడుకులు లేకుండా, రాకుండా, బ్రతుకాలని సదా శ్రీ సత్యసాయిరాముని వేడుకొంటున్నాను. తెలుగుజాతిని, తెలుగు ఖ్యాతిని, తెలుగుమాటను తెలుగు చరిత్రాన్ని, సంస్కృతిని, కళలను వెలుగాపెద్దజేయు పని చెప్పనలవి కానిది. అజరామయమైన తమ సేవ సాటిలేనిది. ఈ 21వ నూరేండ్లలో అటువంటి తెలుగువారు తమరొక్కరేరేన్నది రూఢి. అటువంటి తెలుగు సోదరులైన మీరు తెలుగు వారున్నంత వఱకు యుండాలి సుమా. శ్రీ గోటేటి శ్రీరామారావు కలకాలం బ్రతుకాలని మరల శ్రీసత్యసాయిరాముని ప్రార్థిస్తాను. రోజూ ప్రార్థిస్తాను.

**ఓ ప్రియతమా! సోదరా!** తమ ఆలు తొలి వర్ధంతి గురించి, తమ తెలుగు ప్రియ కొడుకు వ్రాసినది చదివాను. మరింత కలతనొందాను. కృంగిపోయాను. తమ అనారోగ్యానికి కారణము తమ ఇల్లాలు గతించినదియూ అని ఊహించాను. బ్రతుకును పాలుపంచుకొనువారు తల్లికి తర్వాతి తారమే. అటువంటివారి ఎడబాట్లు చాల బాధాకరం. ఆ బాధను సహించి, ఓర్చుకొనే మనోధైర్యం ఆ సాయిరాముడు కల్గించుగాక.

**తెలుగుతల్లి వరపుత్రుడా!** తమ సేవ తమ ప్రియ కొడుకుకు నేర్పించి, ఇప్పుడే ఆ స్థాయికి వచ్చారని శ్రీ గోటేటి వెంకటేశ్వరరావుగారి రచనలను బట్టి తెలుస్తుంది. అతనును తమ అడుగుజాడలననుసరించు బాధ్యత వహించారని తెలుస్తుంది. చాల ముదమైంది. అందుక్కూడా అట్లే తమ ప్రియ కొడుకు తమకు తోడ్పడుచుండుట తెలుగుతల్లి దీవెన. తమ కుటుంబం సైతము ఏ లోటూ లేకుండా నింపాదిగా యుండి తెలుగు సేవను కొనసాగించాలని నా ప్రార్థన.

నాకు ఎక్కువ తెలుగు మాటలు తెలియవు, నా మాటల్లో తప్పులుంటే తెలియక వ్రాసినవి నను మన్నించ ప్రార్థన.

ఇక సెలవు. తెలుగు మ్రొక్కులతో తమ మంచిని కోరే తమ తెలుగు సోదరుడు

(గోపిశెట్టి శ్రీరాములు)

గుర్తు : ప్రముఖాంధ్ర కార్యాలయానికి వచ్చి త్వరలో తమను కలుసుకొని ప్రముఖాంధ్ర జీవిత సభ్యత్వము పొందెదను.


(6వ పేజీ తరువాయి)

వీరి పుత్రులలో ప్రథమ పుత్రులు శివశ్రీ మల్లంపల్లి వీరమల్లేశ్వర శర్మగారు (మా నాన్నగారు) ప్రసిద్ధ సంస్కృతాంధ్ర పండితులే గాక, బందరు అయ్యవార్లుగా ప్రసిద్ధులైనవారు! 3వ వారైన వీరేశ్వర శర్మగారు, అభినవ పెద్దన, పోతన వంటి బిరుదములు పొందినవారు. 4వ వారు 'కవిరత్న' రామలింగశర్మగారు, 5వ వారు శ్రీ శరభేశ్వరశర్మగారు. వీరు తమ 11వ ఏట విశ్వనాథ వారిచే బాలకవి కేసరి అని, కాశీ కృష్ణమాచారి గారిచేత "పుంభావసరస్వతి" అనే బిరుదులు పొందినారు.

మహాయోగులకు, సిద్ధపురుషులకు బ్రహ్మకపాలం పగిలి ప్రాణం పోయే విధంగానే, మల్లిఖార్జునారాధ్యులకు కూడా బ్రహ్మకపాలం పగిలి, బందరులోని మా స్వగృహంలో 1951వ సం॥ములో జనవరి 30న శివసాయుజ్యం (మరణించారు) చెందారు. మల్లిఖార్జునారాధ్యులు నాకు తాతగారు అవడం నా అదృష్టం, నా పూర్వజన్మ సుకృతం. వారి గురించి నాలుగు ముక్కలు నాచేత రాయించి, వారిని మళ్ళీ వెలుగులోకి తీసుకుని వచ్చిన, నాకు ఎంతో ఆప్తులు, శ్రేయోభిలాషులు శ్రీగోటేటి శ్రీ రామారావుగారికి నా హృదయపూర్వక నమస్కారములు, కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ఎనిమిది పదుల వయస్సు దాటినా, ఇంకా ప్రముఖాంధ్ర పురోభివృద్ధికి, అహర్నిశలు శ్రమిస్తున్న శ్రీ రామారావు గారిని, వారి కుటుంబంలోని అందరిని నెల్లూరుకి సుమారుగా 12 కి.మీ. దూరంలో ఉన్న ఆ జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారు సంపూర్ణ ఆరోగ్య, ఐశ్వర్య, భోగభాగ్యాలను ఇచ్చి సదా కాపాడవలసిందిగా మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూన్నాను.

**- మల్లంపల్లి రామప్రసాదు**

# ఆంధ్రప్రదేశ్ తొలి శాసన సభాధ్యక్షుడు
# అయ్యదేవర కాళేశ్వరరావు



మా చిన్నతనంలో ఏ నోట విన్నా, తియ్యతియ్యని ఒకే పాట 'ఆంధ్రప్రదేశ్ మిఠాయ్' 'అయ్యదేవరా కాళేశ్వరుడూ, కాశీనాధుని నాగేశ్వరుడు మన దేశం మిఠాయ్ ఏ గ్రామఫోను పాటవిన్నా, ఏ రేడియో పాట పెట్టినా 'మన దేశం మిఠాయ్' అనే ఈ పాట చెవిముందు రిం వ్ రింవ్ మంటూ వినిపించేది.

ఈ పాటను వ్రాసిన వాడూ, పాడినవాడు అలనాటి చలనచిత్ర హాస్యనటుడు చింత పల్లి రామమూర్తి. ఈ పాటను విని ఆనందించనివారు లేరంటే అతిశయోక్తి కాదు. ఆనాడు సినిమా నటులకన్నా దేశభక్తులైన నాయకుల్నే ఎక్కువగా ప్రేమించేవారు. కుల మత ప్రాంతీయ తత్వాలు లేవు. అగ్రశ్రేణి, దళిత శ్రేణియనే వ్యత్యాసం లేదు. ఆనాడు బ్రాహ్మణులూ, వైశ్యులూ, క్షత్రియులూ, రెడ్లూ చొరవ తీసుకుని సాహసంగా అంటరానితనం, సహాయనిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణం, సమసమాజ సేవల్లో త్యాగశీలంతో పాల్గొనినందువల్లనే జాతియోద్యమం ఫలించింది. వెనుకబడినవాడు నాయకులయ్యారు.

కృష్ణా జిల్లా అందించిన జాతీయోద్యమకారుల్లో ఎన్నదగిన ముఖ్యనేతల్లో అయ్యదేవర కాళేశ్వరరావుగారిని చెప్పుకోవాలి. నికార్సయిన మనిషి నిజాయితీకి, నిరాడంబరతకూ నిలువెత్తు మనిషిగా నిలిచినారు. కనుకనే ఆంధ్రప్రదేశ్ శాసనసభ తొలి స్పీకర్ నిర్వహణాధిపతిగా మంచి గౌరవ ప్రతిష్టలు సంపాదించిన ఘనత వారికి దక్కింది. దేశభక్తి వారి నరనరాల్లో జీర్ణించి ఉంది. గాంధీగారు చేబట్టిన సహాయ నిరాకరణోద్యమం శాసనోల్లంఘనోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, ఖద్దరు వస్త్రధారణా ప్రచారముల్లో వారు ప్రభావశీలమైన పాత్రను తూ.చ. తప్పకుండా ఆచరించారు.

కృష్ణా జిల్లా నందిగామ గ్రామంలో 1881 సం॥ము జనవరి 22న జన్మించిన కాళేశ్వరరావుగారి ప్రాథమిక విద్య అంతా నందిగామలోనే జరిగింది. తరువాత ఉన్నత విద్య బి.ఎ. పట్టా అందుకునేవరకూ మచిలీపట్నంలో జరిగింది. పిమ్మట న్యాయశాస్త్ర విద్యనభ్యసించుట కొఱకై మద్రాసు వచ్చారు. పట్టా అందుకోగానే విజయవాడ వెళ్లారు. 1906వ సం॥ము నుంచీ 1927వ సంవత్సరం వరకూ న్యాయవాదిగా మంచి పేరు సంపాదించారు.

ఆయన దృష్టి పీడిత ప్రజానీకం మీద లగ్నమైంది. అంటరానితనం నిషేధించాలని బృహత్తుద్యమంలో కీలకపాత్ర నిర్వహిస్తూ అవిశ్రాంతంగా పోరాడారు. అలా ఆయన ప్రతీ జాతీయోద్యమంలోనూ పాల్గొన్నారు. జైలుకు వెళ్లారు. కఠినశిక్షలు అనుభవించారు. జైలులో ఉన్నప్పుడే అనేక గ్రంథాల్ని వ్రాయడం జరిగింది. జైలు నుంచి విడుదలయ్యాక న్యాయవాది వృత్తి కన్నా, ప్రజాసేవలోనూ పూర్తికాలం వినియోగించారు. 1956 సం॥ములో ఆంధ్రప్రదేశ్ ఏర్పడడంతో శాసన సభాధ్యక్ష పదవికి సత్యశీలుడూ, సమర్థుడనీ పేరుగాంచిన అయ్యదేవర కాళేశ్వరరావు గారిని ఎన్నుకున్నారు. ఆయన ఆ పదవికే విలువను తెచ్చిన మహనీయుడాయన. అన్ని పార్టీల పట్లా సమతుల్యతను పాటించి సభా నిర్వహణం చేసిన సమర్థునిగా చరిత్రలో నిలిచిపోయిన వృద్ధతరం నాయకుడు. ●

**ఆయన సేవలకు పత్రిఫలంగా విజయవాడలో మార్కెట్‌కు కాళేశ్వరరావు మార్కెట్ అను పేరు పెట్టారు.**


భోగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది




అంబికా దర్బార్‌బత్తి


## పెద్దల మాట చద్దిమూట!

సుస్సులభంగా నిషేధించగల అలవాట్లను అక్షఱ క్రమంలో సూచించారు.

**– డా॥ ఎం.రాములు,** హైదరాబాదు

### నిషేధములు (అక్షర క్రమము)

**అ, ఆ :–** అవివేకము, అసత్యము, అసూయ, అహంకారము, అజ్ఞానము, అత్యాచారము, ఆవేశము, ఆగ్రహము మరియు ఆత్మహత్య.

**ఇ, ఈ :–** ఇతరులకు ఇబ్బంది లేక ఇక్కట్లు కలుగజేయుట., ఈర్ష్య.

**ఉ, ఊ:–** ఉదాసీనత చెందుట, ఊరడింపకుండుట.

**ఋ:–** ఋణపడుట

**ఎ, ఏ, ఐ :–** ఎగతాళి చేయుట, ఏమరపాటు ఐహిక విషయ లోలత్వం

**ఒ, ఓ, ఔ:–** ఒరులపై ద్వేషం, ఓర్వలేనితనము, ఔత్సుక్యము

**క, ఖ :–** కల్మషము, కామము, కాఠిన్యత, కక్ష, క్రోధము, క్రూరత్వము, కుట్ర, కృతఘ్నత, ఖర్మ విముఖత

**గ, ఘ:–** గర్వము, ఘనతలు చెప్పుట

**ఙ:–** "జ్ఞాన విహీన పశుచిత్ సమాన"

**చ, ఛ:–** చంచలత్వము, ఛండాలత్వం, చౌర్యము

**జ, ఝ:–** జోక్యము (అసంబంధిత విషయాలలో కలుగజేసుకొనుట)

ఝరీ ప్రవాహా అడ్డంకులు (ప్రస్తుతం నీటిపారుదల విషయంలో నాయకులు చేస్తున్న ద్రోహమే!)

**ట, ఠ :–** టక్కరితనము, ఠముకుటియారం

**డ, ఢ :–** డంభాచారము, డొంక తిరుగుడు మాట,

**త, థ:–** తమోగుణము, తొందరపాటు చేష్టలు

**ద, ధ: –** దర్పము, దురాలోచన, దురహంకారము, ధనమందాంధత

**న:–** నక్క వినయము, నియంతృత్వము, నేరములు చేయుట, నిందించుట నాస్తికత్వము

**ప, ఫ:–** పక్షపాతము, పన్నాగము, పగ, ఫలమాశించుట

**బ, భ:–** బద్ధకము, భయము, భోగముల లాలస, భ్రమ

**మ:–** మమకారము, మదము, ముక్కోపము, మూఢత్వము, మోహము, మోసము

**య:–** యశము కోసం ప్రాకులాడుట, యాచించుట

**ర:–** రంకు, రాక్షసత్వము

**ల:–** లోభితనము

**స:–** సంకోచము, స్వార్థము, సోమరితనము

**శ:–** శత్రుత్వము

**హ:–** హరించుట, హత్యచేయుట

**హా:–** హాహాకారం, హాని, హాలిక ద్రోహం

**అం:–** అంపపు కోత

**అం:–** అంతము చేయాలని చూచుట

(గతంలో ఇవి 'పంచముఖి' పత్రికలో ప్రచురితమయ్యాయి.)

# మంచి గుణానికి మించిన దైవం లేదు!

మన శాస్త్రాలు బోధించినా, పురాణాలు ప్రవచించినా పెద్దలు చెప్పినా, గురుబోధలైనా మంచికి మించిన దైవం లేదు. సత్యం వద, ధర్మం చర' అన్నదే భగవత్ సిద్ధాంతం. అదే భగవత్స్వరూపం!

దేవుడు మనకు కనిపిస్తాడా? ఈ ప్రశ్న ప్రతి ఆస్తికుడి మనసులోనూ ఎప్పుడో ఒకప్పుడు ఉదయించకమానదు. దానికి సమాధానం దొరక్కా మానదు. హనుమంతుడికీ, పాండవులకీ, ప్రహ్లాదుడికీ, ధ్రువునికీ, రామదాసుకీ, త్యాగయ్యకీ, ఇలా ఎందరెందరికో భగవంతుడు దర్శనమిచ్చి, అభయమిచ్చాడు, ఆదుకున్నాడని విన్నాం. "యద్భావం తద్భవతి" అన్నట్లు ఎలా కోరుకుంటే ఆ భగవంతుడు. అలా కనిపించాడు. ఆయన అనంతకోటి నామధేయుడు.

అష్టోత్తర శత సహస్రోత్తర నామావళి, స్తోత్రాలు మాత్రమే కాదు. పవిత్రత, సత్యం, సత్సంగం, సచ్ఛీలం, సంస్కారం, సంయమనం, సదవగాహన, సహకారం, సన్మార్గం, సదాశయం, సత్సంకల్పం, మానవత్వం, సహనశీలం, క్షమ, ప్రేమ, వాత్సల్యం, జ్ఞానం, సంతోషం, కరుణ, ధర్మం, దానం, పరమత సహనం, పారమార్థికత, అహింస, శాంతి – ఇలా ఎన్నెన్నో లెక్కకు మించిన పర్యాయపదాలు దైవానికున్నాయి. మరి వీటిలో ఏదో ఒకటి ఎక్కడో అక్కడ చూస్తూనే ఉన్నాం. ఎవరో ఒకరిలో పైన పేర్కొన్న సుగుణమేదో ఒకటైనా కనిపిస్తూనే ఉంది! అలా కనిపించడమే మనకు దైవదర్శనము అయిందన్న మాట! మనకిప్పుడు దశావతారాల రూపాల్లో కనిపించడు దేవుడు.

మనం పైన చెప్పుకున్న దివ్యగుణాలన్నీ దైవానికి ప్రతిరూపాలే. ఈ గుణాలను మనలో ఓవైపు పెంచుకుంటూ ఇతరుల్లో ఆ గుణాలను దర్శించాలి. ఇతరుల్లోని లోపాలు, పాపాలు వెతకడమంటే, మన లోపాలను, పాపాలను పెంచుకునేందుకు సన్నద్ధమైనట్టే! అందుకే సంత్ కబీర్‌దాసు "ప్రపంచంలో చెడ్డవాడికోసం వెదికాను. ఎక్కడా దొరకలేదు. చివరికి నా మనసులో వెదికితే నన్ను మించిన చెడ్డవాడు లేడనిపించింది" అని అంటాడు. యోగులు, మహర్షులు, పౌరాణికులు, పండితులు, ఎవరైనా ఎదుటివారి లోపాలు, దోషాలను గురించి ముచ్చటిస్తున్నారా? హంస క్షీరం స్వీకరించి నీటిని వదిలిపెట్టినట్లు; ఆమాత్రం సామాన్యగుణాన్ని అలవరచుకుంటే దైవత్వం ఇంక కనిపించని చోటుంటుందా? ఈ కలియుగంలో కేవలం నామస్మరణ చేసినంతమాత్రానే ముక్తి లభిస్తుందన్నారు కదా! ఇది మానవ జాతికి ఎంతటి గొప్పవరం. మనమనుకున్నది జరగదు. అనుకోనిది జరుగుతుంది.

కాలచక్రం మన చేతిలో లేదు. జనన మరణాలు మన ఆధీనంలో లేవు. మరెందుకీ 'అహం'? అందుకే వీటన్నింటికీ మూలకారకుడైన ఆ దైవం పట్ల విశ్వాసం కలిగివుండాలి. తననే పూజించమని ఆయన కోరలేదు. మంచి ఎక్కడుంటే అక్కడ ఉన్నానన్నాడు. ఆ మంచినే మనం పూజిద్దాం. గౌరవిద్దాం. నైతిక వర్తన, పాపభీతి ఉన్నచోటల్లా మంచితనం, మానవత్వం స్థిరంగా, శాశ్వతంగా ఉంటాయి. ప్రధానంగా వీటిపైన విశ్వాసం కలగాలి. దేహమంటేనే సందేహాల పుట్ట. జ్ఞానంవల్ల సందేహం తొలగిపోతుంది. గీతాచార్యుడు శ్రీకృష్ణపరమాత్ముడు "సంశయచిత్తుడు వినాశాన్నే పొందుతాడు" అని అంటాడు. అటువంటివాడు ఇహంలోను, పరంలోను సుఖశాంతులు పొందలేడు. కస్తూరి పరిమళాన్ని తన నాభిలోనే ఉంచుకున్న కస్తూరి మృగం ఆ సుగంధం కోసం ఏ గడ్డిలోనో వెదకడం వంటి మూర్ఖత్వానికి దాసోహమంటున్నాం (హిమాలయాల మంచు కొండల్లో కస్తూరి మృగం అనే జింక లాంటి జంతువులు సంచరిస్తుంటాయి. ఈ కస్తూరి మృగం యొక్క నాభి (బొడ్డు) నుండి మదపదార్థం స్రవిస్తుంది. అది గొప్పగా సువాసనలు వెదజల్లుతుంది. దానిని మృగమదం లేక 'కస్తూరి' అంటారు. ఈ కస్తూరి అలంకార సుగంధ ద్రవ్యాలలో శ్రేష్ఠమైనది. దీనికి ఆయుర్వేదంలో ప్రత్యేకస్థానం ఉంది. ఈ కస్తూరిని తిలకంగా ధరిస్తారు. "కస్తూరి తిలకం లలాట ఫలకే" అనే శ్రీకృష్ణ ప్రార్థన మనకు తెలిసిందే!

శబ్దార్థాలవలె ప్రకృతి, పరమాత్మ కలిసే ఉన్నారు. ఒక నాణానికున్న బొమ్మ, బొరుసులు. వీరు ప్రకృతిలో సర్వత్రా సౌందర్యాన్ని చూడగలిగేవారు. సత్యం, శివం, సుందరాన్ని సర్వదా దర్శించగలడని గ్రహించాలి. దైవదర్శనం చేసుకొనేందుకు మన సనాతన ధర్మం ఎన్ని సులభమైన మెలకువలు తెలిపింది? సత్యం, ధర్మం, న్యాయం, పరోపకారం, మనోనిగ్రహం, పురాణశ్రవణం, సత్సాంగత్యం దైవనామ స్మరణ. ఇలాంటివి అలవరచుకొనమన్నది; ఇవన్నీ మన దైనందిన జీవనంలోని అతి ప్రధానమైన అంశాలే. వీటిని వేరుచేసి జీవిస్తున్నాం. జీవన వ్యాపారాలు కొనసాగిస్తున్నాం. మనకు దైవదర్శనం ఎలా కలుగుతుంది? బాంధవ్యాలు పటిష్ఠంగా ఉన్నచోట, కుటుంబ సభ్యుల మధ్య ఐక్యతాభావం కలిగినచోట పారస్పరిక ప్రేమభావం ఉన్నచోట భగవతత్త్వం తప్పక ఉంటుంది.

నేడు ఎన్ని కుటుంబాల్లో చక్కని అనుబంధాలు, బాంధవ్యాలు సంతోషప్రదంగా పరిఢవిల్లుతున్నాయి? మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ, ఈ కనీస ధర్మాలనైనా పాటిస్తున్నామా? కనిపించే, కని పెంచే దైవాలను దర్శిస్తూ కూడా ఉపేక్షించడం లేదా? మానవుడు తన్ను తానెరిగితే తత్త్వజ్ఞుడూ, ఆత్మజ్ఞుడూ అవుతాడు. చూసే శక్తీ, చూడాలన్న ఆసక్తీ మన అంతర్చక్షువులకంటే సర్వత్రా, సర్వదా దైవదర్శనం సులభమే. అద్దంలో చూసుకుంటూ మనకు మనమే సుందరులమని పొంగిపోయే అజ్ఞాన తిమిరంలో ఉన్నన్నాళ్ళూ దైవదర్శనం ప్రాప్తి కలుగదు.

మనిషిలోని మంచి గుణాలే దైవత్వానికి ప్రతీకలు. అందుకే "దైవం మానుష రూపేణ" అన్నారు. అంతశ్శుద్ధి ఉన్నచోటనే ఆత్మ, పరమాత్మ విరాజిల్లుతాయని వేదాలు చెబుతున్నాయి. నిర్మలమైన ధ్యానంలో మౌనంలో భగవద్ధ్యానంలో పరమేశ్వరుణ్ని తప్పక దర్శించగలుగుతాము. భ్రమలేని నిరంతర శ్రమలో ఏకాగ్రతలో నిశ్చలత్వంలో దైవం దివ్యతేజస్సులో వెలుగొందుతూ గోచరిస్తూన్నాడు. ఇన్ని అవకాశాలు పొందిన మనోనేత్రాలతో ఆ సర్వాంతర్యామిని దర్శించుకోగలగడం మానవ జన్మకు ప్రాప్తించిన మహావరం. దీన్ని సద్వినియోగం చేసుకోవడం మన చేతుల్లోను, చేతల్లోనే ఉంది. ఈ మంచిని మరిచి అసూయ, అధర్మం, అనైక్యత, హింసాద్వేషాలు పెచ్చు పెరిగిపోతున్నాయి. ప్రకృతిని నాశనం చేస్తున్నాం. అందుకే ప్రకృతి కూడా మనిషి మనుగడకు విఘాతం కలిగిస్తూంది. శాంతి, ప్రేమ, సత్యశీలములు పెరిగిననాడే మనిషి మహామనిషి యనిపించుకుంటాడు. మహాదేవుడనిపించుకుంటాడు. పృథ్వీమాతా! మనిషిలో మంచితనం పెరిగేట్టు కృప చూపు తల్లీ! అని ప్రార్థిద్దాం.

– **కె.మల్లిఖార్జున**, బళ్లారి

Beautiful City - Beautiful Hotel



DO NOT MISS

Forevear your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# మామిడిచెట్టు సాక్షిగా మంగళతోరణం - వరుస వరుసు రథములపై పసుపు కుంకుమలు అద్దినట్లు రంగు రంగులు

## అదియొక వైకుంఠధామం శివకేశవ అభేదులు శివానంద సద్గురువులు!



దక్షిణ భాగమున రామపరివార సమేతుడైన సీతారాములుండిన దివ్యమందిరం, వేదికకు వామపరిభాగమున రామపరివారమున్న జ్ఞాపికలు, శాలువాలు, పుష్ప గుచ్ఛములూ విజయోస్తు అని ఆశీర్వదిస్తున్నట్టుగా ముఖ్య అతిధి జ్ఞప్తికి. వేదిక మధ్యలో గాయనీ బృందపురామగానరస పారాయణం చూస్తూంటే త్యాగరాజే వచ్చి రామకథా సుధారసపానము చేసీ రంజిల్లవే మనసా' యని స్వరసురాగం కలిపి సమ్మోహింపచేసాడా అన్నట్టు ఆ బాలగుణగణగళం 'రామ' రస పరిమళాన్ని గుభాళింపచేస్తూండగా – వేదిక ముత్యాల పందిరిగా అమరింది. అది పున్నమికాని నవమియైనప్పటికినీ పునర్వసూ నక్షత్ర ఘడియలకు పులకాంకితమై వేల శశాంకులు ఒకచోట ఒనగూడి వెన్నెలకాంతులను ఆరబోస్తున్నట్లున్న సీతారామ వివాహ వేదికా అన్నట్లున్నది. పచ్చని మావికిరణములు వాకిట, వేదిక వ్రాలగ, మిథిలాపురి వీధి వీధులందు పందిరులు భాసిల, ముగ్గులెసంగ ముంగిట, పసిడి పచ్చరయంతి మండపం నచ్చెరువొందనయగార సువర్ణసౌరభాల, సత్యధర్మాల బంధానుబంధమై పాలుతేనెల ఖండచక్కరల మధురతను గుభాళిస్తూ, మిథిలాపురి ధామమా అన్నట్టు అంబరాన నిలిచిన దేవతాళియంతా త్రివోలీ వనధారపై వ్రాలినట్లున్నది.

**చైతన్యం రఘునాధస్య శతకోటి ప్రవిస్తరం**
**ఏకైక మక్షరం పుంసాం మహాపాతకనాశనం**


– అనే శంకరవాణి పునర్భవిస్తూ వేయి పున్నమిల కాంతితో ప్రతిబింబిస్తోన్న త్రివోలీ నందనవనానికి తొలి వందనమందచేద్దాం.

# నోబుల్ అవార్డుల కన్నా విలువైన శ్రీరామ నవమి ప్రతిభా పురస్కారమందుకోవడం-

## - ఆనందనందకర శివానంద సద్గురువ్వుల ఔదార్యమే -

సత్యానికి, నీతికి, ధర్మానికి, ధీరతకూ, క్షమాగుణానికీ ప్రతీకగా శ్రీరామచంద్రుడు ఆదర్శంగా అనువర్తించి చూపిన మార్గాలు లోకానికి అనుసరణీయమైనవి. ఆ లోకోత్తరుడైన శ్రీరాముడ్ని స్మరిస్తూ, ఆయన జన్మించిన ఈ చైత్రశుద్ధ నవమీ, పునర్వసూ నక్షత్రయుక్త పుణ్యదినమున, భారతీయ సంస్కృతీ సాంప్రదాయయములతో








బాటు సనాతన ధర్మవారసత్వ విలువలు ఇప్పటి తరానికి తెలియచేయాలనే సంకల్పంతో, సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రంగాల లబ్ధప్రతిష్ఠులైన పన్నెండు మందికి శ్రీరామ నవమి ప్రతిభా పురస్కారములంద చేస్తున్నట్లు ఆనందవనం అధిపతులు, ఋషితుల్యులు, సన్మార్గపథగామి, సదానందచిత్తులైన సద్గురువరేణ్యులు శ్రీ కందుకూరి శివానందమూర్తి మహోదయులు ముందుగా తెలియచేసారు.

**ఆనంద సింధురాస్తే, సీకరతే త్రైలోకసుపాసీ**

**సోసుధామ రామ షసనామా అఖిలలోక**

**దాయిక విశ్రమ** – ఆనంద సముద్రం సుఖరాసి ఆనందసాగరంలోని ఒక బిందువు సాగరంలోని ఒక బిందువు చేత ముల్లోకాలకు సుఖాన్ని ప్రసాదించేవాడు ఆయన సుఖధాముడికి రాముడనే పేరున్నది. అంతేనా ఆయన సహనం సర్వదుఃఖానాం అప్రతీకార పూర్వం" ప్రతీకారేక్షకులోను గాకుండా, దుఃఖాన్ని సహించడమే త్రితక్షణగా చెప్పినట్లు – తండ్రి మాట కోసం క్షోభ చెందాడు, వనవానం చేసి ధర్మానికి గ్లాని కలిగిస్తున్న అసురమూకను సంహరించాడు. సాక్షాత్తూ ఆది నారాయణుని పరిపూర్ణావతారం తానైనప్పటికీనీ దశరథాత్మజ రాముడుగనే ఆయన చరించాడు.

**రామమంత్రం యోజపేత్ నరామో భగవతీతి రామేగోక్తాః** – శ్రీరామమంత్రాన్ని జపించేవారు. శ్రీరాముడే అవుతాడని శ్రీరామచంద్రమూర్తి చెప్పినట్లు రామరహస్యోపనిషత్తు చెప్పింది. 'రామ' శబ్దాన్ని పలికితే శివకేశవులిరువురూ పూజించినట్లేయనీ ఋషితుల్యులూ, స్వాధ్యాత్మికులూ అమృత వాక్భాషితులూ, అమోఘ భారతీయధ్యాయనపరులూ, రామునివలె పితృభక్తియుతులూ, యతులూ సత్యసంధతకై, ఔదార్యానికీ ప్రతీకయైన సద్గురు దేవులు శ్రీ కందుకూరి వంశోద్భవులూ, రామభక్తి పరులైన బసవరాజుగారి పుత్రులైన శివానందమూర్తి మహోదయులూ "అందరిలోనూ శ్రీరామచంద్రుని ఆ దర్మం మూర్తీభవించాలని, శ్రీరామనవమి పరమధర్మోప పర్వదినంగా భావించి, పండితులను, కవులను, పత్రికా రచయితలనూ, కళాకారులనూ, విద్వాంసుల ప్రతిభను గుర్తించి, శ్రీరామనవమీ ప్రతిభా పురస్కారములను మార్చి 31వ తేదీ శ్రీరామనవమి రోజు పన్నెండు రాశులు వంటి సాహితీవతంసులను సత్కరించారు. అలనాటి మహారాజులూ, జమీందారుల సత్కార ఔచితిని మించిన విధంగా, సహృదయ, సగౌరవ, సమున్నతంగా జరుపడం సద్గురువులకూ సనాతనధర్మ ఛారిటబుల్ ట్రస్టుకే సాధ్యమవుతుంది. ప్రభుత్వాలుగాని, పెద్ద పెద్ద సంస్థలుగానీ ఇంత అంకితభావంతో, ఆమేయ వాత్సల్యంతో, విమల హృదయంతో జరుపలేరన్నది అక్షఱ సత్యం. వారు ఉర్లాం జమీందారీ వంశజులు. తాత, తండ్రుల తరం నుంచీ, అంతరాలకు పోకుండా, అంతఃకరణలను పసిగట్టి దానధర్మాలను చేయడం కందుకూరి బసవరాజు వంశీయులకే చెల్లింది. వారి తండ్రిగారిలాంటి దానధర్మాల నెన్నిటినో చేసి, నిండూ నూరు సంవత్సరాలు పూర్ణాయురారోగ్యాలతో జీవించారు. వీరింట బసవరాజు నామధేయులెక్కువ. సద్గురువుల జ్యేష్ఠ కుమారులు కూడా బసవరాజు నామధేయులే! ఆయనే ఈ సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్టుకు మేనేజింగ్ ట్రస్టీ సునిశితంగా పరిశీలించాను. గురువుగారివలె నిరాడంబర సాధుమూర్తి వలంటీర్‌గా అందరితో కలిసి తిరిగారే తక్క మేనేజింగ్ ట్రస్టీ హోదాను జమీందారీ గరిమను చూపలేదు. ఇక గురువు గారంటారా పూర్వవంశీకుల శివాచారనిరతి, దాన ఔదార్య ధర్మగుణం, సంగీత, సాహిత్య, సంస్కృతీ పోషణ, గ్రంథ రచన, గ్రంథ రచయితల పోషణ తరచి చూస్తూంటే కందుకూరి మహాలక్ష్మమ్మగారి పండిత పోషణను, అలాగే, అంతకుమించి కూడా పోషిస్తున్నారు.

## - అనేక ఇతర పురస్కారాలు -


ఆంధ్ర మ్యూజిక్ అకాడమీని నెలకొల్పి, సంగీత విద్వాంసులకు భూరిసత్కారం, విద్యా, వైద్య, ఆధ్యాత్మిక, సామాజిక రంగ కృషీవలుల పురస్కారం, తమ జన్మదినమున పురస్కారం, తమ సతీమణి పేరిట పురస్కారం – ఇలా ఇలా నెలరాజు పౌర్ణమి







పౌర్ణమికి వెలుగు విందును చేసినట్లు – పన్నెండు మాసాలూ ఏవో మహోన్నత, మహద్దీపికా పురస్కారములను చేస్తూనే ఉంటారు. భోజరాజుగానీ, కృష్ణదేవరాయలు, నాయకరాజులుగానీ ఇంతటి విశిష్టంగా, విమలంగా, విశేషణంగా చేసిన దాఖలాలు ఎరుగను. బుద్ధుని అడుగుజాడల్లో నడుస్తూ, దుఃఖహేతువును తునమాడడానికి, భారతీయతను వికసింపచేయడానికీ పునర్జన్మించిన ఆదిశంకర భగవత్పాదులో, విద్యారణ్యస్వాములో, రామకృష్ణులో, వివేకానందులో – ఇమ్మనుజ అవతార అంశుడని ఇదమిద్ధంగా చెప్పలేను. సత్య, ధర్మ, దానాలను పరివ్యాప్తం చేస్తున్న పరివ్రాజకులు.



అతి స్వచ్ఛమైన తెల్లని ధోవతి, చొక్కా, ఆపైన అంచుగల తెల్లకండువా, 'నెన్నుదుట వీబూతి రేఖలు, సాంప్రదాయపు బొట్టు, స్మితస్మితంగా సదా కనిపించే చిరునవ్వు చూస్తుంటే ఆయనలో గురుతీవీ కనపడదు. సామాన్య మానవుని నిరాడంబరతే! హైకోర్టు న్యాయమూర్తి నూతి రామ్మోహనరావు సమక్షమున, సద్గురువరేణ్యులు శాలువా కప్పి, జ్ఞాపిక యివ్వడం, కందుకూరి బసవరాజు భూరి పారితోషిక ప్రదానం చేయడం, న్యాయమూర్తులు జ్ఞాపికలివ్వడం దివ్య త్రిమూర్తుల దర్శనమైనట్లు మనసు మందార మకరంద మధుర మందస్మితమైనది.

## -ప్రతిభా పురస్కార గ్రహీతలు ఉద్దండులు!-

**1) సంస్కృత, జ్యోతిష్య పాండితీగరిష్ఠులు ఇరగంటి రంగాచార్య**
**2) సీనియర్ ఇంగ్లీషు స్కాలర్, కవి ఏలేశ్వరపు నాగేశ్వరరావు**
**3) ఆర్థికశాస్త్ర పారంగతులు వేదుళ్ళ రామకృష్ణయ్య**
**4) ప్రముఖాంధ్ర సంపాదకుడు, రచయిత గోటేటి శ్రీరామారావు**
**5) ప్రముఖ చిత్రకారుడు గిదుతూరి కన్నారావు**
**6) ఆయుర్వేద ఆచార్యులు భాగవతుల రామారావు**
**7) వేదాంత కోవిద శ్రీమతి శిష్లా విజయభారతలక్ష్మి**
**8) మహిళా సంక్షేమ కార్యకర్త శ్రీమతి యిమ్మడి సరస్వతీరావు**
**9) ప్రముఖ కవి, అన్నపురెడ్డి వేంకటేశ్వరరెడ్డి**
**10) భాషా పరిశోధకులు శ్రీమతి ముక్తేవి భారతి**
**11) సామాజికోద్యమకారిణి శ్రీమతి సోమరాజు సుశీల**
**12) మహాసహస్రావధాని గరికపాటి నరసింహారావు**

(వీరొక్కరూ తక్క, మిగతా వాళ్లందరూ ఎనిమిది పదుల వాళ్ళే)

ఇలా 10 సం॥ములుగా శ్రీరామనవమి ప్రతిభా పురస్కారములతో 120 మందిని సత్కరించినట్లు తెలుస్తూన్నది. సికిందరాబాద్ తివోలీ గార్డెన్స్‌లో అత్యంత శోభాయమానంగా, శ్రేయోదాయకంగా, శ్రీరాముని బాట సర్వులకు అనుసరణీయమనే దివ్య సందేశంతో కూడిన ఈ సభలో శ్రీమతి సుధాస్వామి గురుత్వ పర్యవేక్షణలో ముక్కుపచ్చలారని బాలలందరూ ఎంతో భక్తిరసాత్మకంగా రామనామగానం చేయడం గురువులు వారిని పుష్పగుచ్ఛంతో ఆశీర్వదించడం, అనన్తరమ్ సాంప్రదాయబద్ధంగా శ్రీసీతారామలక్ష్మ, హనుమత్సమేత పరివార పూజ చేసి, వడపప్పు, పానకం నివేదనలు చేసి అతిథులుగా ఆహ్వానితులుగా వచ్చిన రెండువేల మంది ఆబాలగోపాల అతిథి భక్తగణానికి ప్రసాదములతోబాటు పూర్ణాహారవిందును చేస్తూ ఒక్కొక్కరికీ ప్రత్యేకముగా అందినవో, లేవో పర్యవేక్షించడం ఆదరణ చూపడం – నా సుదీర్ఘ జీవితంలో ఈ సభలోనే చూసాను. స్వామివారి ట్రస్టీలు, చివుకుల మురళీకృష్ణ, ప్రభాకర్, రామారావు ప్రభృతుల ఆదరణం (కొన్ని పేరులు మరిస్తే క్షమించండి) బసవరాజుగారితో నద్పాటు ఎక్కడా, ఎప్పుడూ (నభూతో న భవిష్యతి) జరగలేదని ఢంకా భజాయించచెప్పగలను. సనాతన ధర్మఛారిటీ ఇతర ట్రస్టీలు, వాలంటీర్ల సేవాదృక్పథం అంకితభావం ప్రశంసనీయం.

చైత్రమాసం చైతన్యపూరితం అన్నట్టు పన్నెండు మంది ప్రతిభావంతుల విశేషాలను ప్రశంసాపత్రంలో నుడిపాత్రంగా వ్రాయడం, చదవడం, ఒక్కొక్క పురస్కార గ్రహీత ప్రతిస్పందనకు అవకాశం యివ్వడం సభా నిర్వాహకుల సంస్కారం, గురువుల శిక్షణేయని విదితమవుతుంది. ముఖ్యతిథి న్యాయమూర్తి నూతి రామమోహనరావు అధ్యక్షుల పలుకులు పలుకుతూ ఇటువంటి ప్రతిభగల వేదికలో, సద్గురువుల సమక్షంలో పాల్గొనడం అనిర్వచనీయమైన అనుభూతి కలుగచేస్తుందని చెబుతూ, బహుముఖ ప్రజ్ఞాశాలురు అలంకరించిన ఈ వేదికపై '12' సంఖ్యకు విశిష్ట ప్రాధాన్యముందనీ, ఈలాగే 12 మంది ప్రముఖులకూ సన్మానం వేడుకగా నిర్వహించడం గొప్ప సంకల్పమన్నారు. భవసాగరం నుంచీ మోక్షసాధన దిశగా పయనింపచేయడానికి సద్గురు కటాక్షం ఆవశ్యకం అన్నారు. పరమశివుణ్ణి దర్శించే శక్తి అదృష్టం మానవమాత్రులకు లేకపోవడంతో సౌమ్యమైన, అమృతవాత్సల్యమానవమైన సద్గురు శివానంద మూర్తి రూపంలో ఆ శంకరుడు సాక్షాత్కరిస్తున్నారన్నారు. సర్వులూ, సద్గురు ఉపదేశం పాటిస్తేనే–గురువుల ఆశీస్సుకు సార్థకత ఉంటుందన్నారు. పురాణ కేసరి, బహుముఖ ప్రతిభాశాలి, తొమ్మిది పదుల వయసు కంచు కంఠగాత్రుడు మల్లాది చంద్రశేఖరశాస్త్రి గారు రామాయణంలోని అంశా ప్రవచనం చేస్తూ, అందు గురువుల ఉత్కృష్టతను రామాయణంతో సంధించి చెప్పడమెంతో సముచితంగా వున్నది.

వేదికమీద వారు, వేదిక నలుప్రక్కల వారూ 4 గంటల పాటు చీమ చిటుక్కుమనే సందడి చేయకుండా ఉండడం ఈ సభలోనే చూశాను.

భారతీయులకు ఆదర్శపురుషుడైన శ్రీరామచంద్రుని జన్మదినమే హిందువుల పవిత్ర పర్వదినం. పుట్టిన తిథినాడే సీతాపరిణయమాడినవాడూ శ్రీరాముడే! శ్రీరామచంద్రుడు వైవస్వమన్వంతరం త్రేతాయుగం నాలుగవ పాదంలో విళంబి నామ సంవత్సరం, చైత్ర శుద్ధ నవమి పునర్వసు నక్షత్ర శుక్ల పక్ష నవమి తిథిలో జయవారం కర్నాటక లగ్నంలో, గ్రహ సంపుటి ఉచ్ఛస్థితిలో ఉండగా సరయూ నదీ తీరంలోని అయోధ్యా నగరంలో జన్మించిన ఫాల్గుణ మాసంలో అదే పునర్వసు నక్షత్రం, జయవారంలో పుట్టిన నేను జగద్గురువులు కరకమలాల స్పర్శ ఆశీర్వచనముతో ఆశీర్వదింపబడడం వశిష్ట ఆశీర్వచనంగా భావిస్తున్నాను. ఈ జన్మ నీ ప్రతిభా పురస్కారం పునీతం చేసింది. ●

# ఆంధ్రులకో విష్ణుమూర్తి ఆలయం ఉన్నది! అదే ఆంధ్ర మహావిష్ణు ఆలయం!



**- శ్రీకృష్ణదేవరాయలు తెలుగు గ్రంథ రచనా ప్రేరణ పొందడానికి కారకుడు ఆంధ్ర మహావిష్ణువే !! -**

**ఆంధ్రుల ఘనత ఎంత గొప్పదో చెప్పడానికి కృష్ణాతీరాన గల శ్రీకాకుళంలో ఆంధ్ర మహావిష్ణువు వెలసి ఆలయం నిర్మింప చేసుకొన్నాడు.**

కృష్ణానది పరివాహక ప్రదేశమైన ఆంధ్రదేశం ఎంతో పుణ్యం చేసుకున్నది. శ్రీశైల మల్లన్న ఆలయం నుంచీ లెఖ్ఖగట్టి విజయవాడ మీదుగా కృష్ణానది హంసల దీవి వద్ద బంగాళాఖాతములో కలిసేవరకూ తీరతీరమంతా భక్తజనులను తరింపచేసే ఆలయాలే! విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ తల్లి, ఇంకా ముందు వెడితే పంచరామ పరమేశ్వరుడు అమరేశ్వరుడు, నదీతీరానికి ఓ పది మైళ్ళలోపున్న పానకాల నరసింహస్వామి , మరల కృష్ణా తీరానికి వచ్చేసరికి ప్రపంచ ప్రసిద్ధిగన్న కూచిపూడి సిద్ధేంద్రయోగీ క్షేత్రం తరువాత కొనసాగే తీరంలో మొవ్వలో వేణుగోపాలకృష్ణడి ఆలయం ఆయన్నే తన పదాలతో, కీర్తనలతో తరింపచేసిన వాగ్గేయకారుడు క్షేత్రయ్య, అలా తీర ప్రయాణం కొనసాగిస్తే ఆంధ్ర మహావిష్ణువు ఆలయం శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు దేవాయని శతకం కూడా ఉన్నది. ఆ ఆలయమందు కొలువైన దేఁవుడు ఆంధ్ర మహావిష్ణువు, శ్రీకాకుళం ఆంధ్ర మహావిష్ణువుగా ప్రసిద్ధి నొందడం ఒక విశేషమైతే – హంపీ విజయనగర పాలకుడు సాహితీ సమరాంగణా చక్రవర్తి ఓ రాత్రి బస చేసినప్పుడు ఆయన కలలో ప్రత్యక్షమై – కృష్ణదేవరాయా – నీవు ఆంధ్రములో ఒక కావ్యం వ్రాయి అని ఆదేశించారు. అదే ఆండాళ్ శ్రీరంగనాధుల పరిణయగాధ 'ఆముక్త మాల్యద'ను వ్రాసి కవుల ప్రశంసలందుకుని సాహితీ సమరాంగణా చక్రవర్తి అనిపించుకున్నారు. ఆంధ్రభోజునిగా కీర్తిపొందాడు. ఆంధ్ర మహావిష్ణు ఆలయం వేరెక్కడునూ లేదు. గోల్కొండ పాదుషా తానీషా ఆ ఆలయమార్గం మీదుగానే కూచిపూడి వెళ్ళి, కూచిపూడి బ్రాహ్మణుల నృత్య నాటకమును చూచి 600 ఎకరాల అగ్రహార భూమిని ఈనాముగా యిచ్చారు. ఆప్రక్కనున్న మొవ్వలో పురాతనమైన వేణుగోపాల ఆలయం ఉన్నది. తొలి వాగ్గేయకారుల్లో ప్రతిభావంతుడైన భక్తునిగా కృష్ణభక్తిని రంగరించి వ్రాసి ఆలపించిన క్షేత్రయ్య కృతులు జగద్విఖ్యాతమయ్యాయి. కానీ ఆయనకు రావలసినంతగా ప్రచారం రాలేదు. నర్తకులకు కూడా ఆ కృతులు సిరిమువ్వల స్వరఝురులను కల్పించి, ధరను సమ్మోహపరిచాయ్.

ప్రఖ్యాత భక్తిపరదంపతులూ, సాంప్రదాయ సంగీతమును గౌరవపరిచే నటీమణి అంజలీదేవి, సుప్రసిద్ధ సంగీతకుడైన ఆమె భర్త ఆదినారాయణరావు క్షేత్రయ్య చిత్రాన్ని నిర్మించి, వాగ్గేయకారుని పట్ల భక్తిప్రపత్తులను చూపారు.

నృత్యానికీ, సంగీతానికి ఆనందరసం పోసి తనచుట్టూ ప్రపంచానికి ఆనందం నింపినవాడు. పైగా మొవ్వలో వెలిసిన గోపాలుణ్ణి మువ్వగోపాలుడని అంటారు. కృష్ణదేవరాయలు వంటి ఆంధ్ర చక్రవర్తులే గాకుండా, తానీషా వంటి గొల్కొండ పాదుషాలు కూడా, కృష్ణాతీరపు సాంప్రదాయ సంగీత, నృత్యాలకు వెన్నంటిన వెన్నెముక బలిమిగా ఉన్నారు. అందుకే కృష్ణానదిని తెలుగువారి కృష్ణవేణిగా కొలిచారు. కృష్ణానది ఉపనదిని 'కిన్నెరసాని'ని తలుస్తూ, పులకిస్తూ 'కిన్నెరసాని' పాటలు వ్రాసి విశ్వనాథ సత్యనారాయణ మరింత వన్నెగూర్చారు. ఇందిరాదత్ జనకులు ముక్త్యాల రాజావారు పైసా పైసా చేర్చి నాగార్జునసాగర్ నిర్మాణం తలపెట్టి, కొన్ని వేల ఎకరాల కృష్ణా గుంటూరు జిల్లా ప్రాంతాల లక్షలాది ఎకరాలకు సస్యశ్యామల సమృద్ధికర పంటలు పండించడానికి ఆంధ్ర మహావిష్ణువు గరిమగల ఆశీస్సులనే చెప్పాలి. నాగార్జునకొండపై, అమరావతీ గడ్డపై బౌద్ధులు విహారం చేసి స్థూపనిర్మాణాలు చేసుకున్నారంటే ఆంధ్ర మహావిష్ణువు ఔదార్యమే కారణం. అన్ని మతాల పట్ల, కులాల పట్ల ఔదార్యం చూపగల దయాశక్తిని ప్రసాదించినవాడు ఆంధ్ర మహావిష్ణువు. ఆంధ్ర మహావిష్ణువుకు జేజేలు. శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణుదేవా! ఆంధ్రభాష పునర్వైభవం సిద్ధించుగాక అని దీవించు తండ్రీ! ●





*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**





# ఢిల్లీలోని తెలుగువారికి కొండంత బలమిచ్చువారు సదరన్ ట్రావెల్స్

# కొండంత తెలుగు రుచులు చూపు హోటల్ సదరన్!

## - వరుసగా ఐదవసారి వరుసవేదిలా భారత ప్రభుత్వంచే ఉత్తమ పర్యాటక సంస్థగా అవార్డు పొందిన సంస్థ -

తెలుగువారు, అందు ఆర్యవైశ్యులు ఏ నేలకేగి ఏ వ్యాపారం చేసినా, ధర్మబద్ధంగా చేస్తారనెడిది సదరన్ ట్రావెల్స్ సంస్థ ఋజూ చేసింది. పేరుకు సదరన్ ట్రావెల్స్ అయినప్పటికినీ భారతదేశమంతటా టూరిజమ్ సంస్థను వ్యాప్తం చేసింది. నేపాల్, టిబెట్, మానసరోవరం, దక్షిణాఫ్రికా, మారిషియస్, మలేషియా, సింగపూర్ వంటి సాగర మధ్యప్రదేశాలకు కూడా వీరి సదరన్ ట్రావెల్స్ యాత్రా సంస్థ యాత్రీకుల సౌకర్యానికి ప్రాముఖ్యమిస్తూ, ఇది మన సంస్థ, మన తెలుగువారి సంస్థ; మనింటి వాతావరణం నిండుగా ప్రకాశం చేస్తుంది. 110 సకల సౌకర్యములు గల గదులు, మన వంటింట్లో చేసిన వంటల్లానే రుచులు భోజనం వేకువనుంచీ అర్ధరాత్రి వరకూ తెలుగు వాతావరణం, తెలుగు మాటలు, తెలుగు పత్రికలు, తెలుగు మాట్లాడే సిబ్బంది – అక్కడ అంతటా ఆణువణువునా తెలుగుదనం ఉప్పొంగుతూంటుంది. ఇంకా చెప్పాలంటే భారత రాజధానీ నగరం కరోల్‌బాగ్‌లోని ఆర్యసమాజ్ రోడ్‌లో ఉన్న ఈ తెలుగువారి సంస్థ మినీ ఆంధ్రప్రదేశ్ విత్ మెనీ ఆంధ్రా కల్చర్‌యని చెప్పాలి.

ఆర్యవైశ్యులు వ్యాపార విజ్ఞులు, ధర్మపరులని ముందే చెప్పుకున్నాం. ఏ.వెంకటేశ్వరరావు (ఎ.వి.రావు) వారి ఇద్దరి కొడుకుల నేర్పుతో నిపుణతతో ఈ రెండు సంస్థలూ నడుపబడుతున్నాయ్. పెద్ద కుమార్డు ఏ.కృష్ణమోహన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులను అంకిత భావంతో నిర్వహిస్తున్నాడు. రెండవ కుమారుడు ప్రవీణ్‌కుమార్ సదరన్ జోన్ నిర్వహణను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహణం చేస్తున్నాడు. భారతదేశంలోని ప్రతీ పర్యాటక కేంద్రానికీ, ప్రతీ దైవ క్షేత్రాలకు వీళ్ళ ఆధునిక బస్సులు వెడుతూనే ఉంటాయ్. ప్రతీ బస్సుకూ తెలుగు తెలిసిన గైడు ఉంటాడు. యాత్రల్లో వచ్చే రాత్రి మకాములకు మంచి మంచి హోటల్స్ ఏర్పాటుచేస్తారు. భోజన ఉపాహార సమయాల్లో మంచి మంచి ఫలహారశాలల వద్దనే ఏర్పాటుచేస్తారు. సదరన్ ట్రావెల్స్‌కు అందరూ అనుబంధ సంస్థలూ నేస్తులే! ఆదరంతో భోజన ఫలహారములను పెట్టేవారే!

అతిథి మర్యాదలో ఆంధ్రులు, అందునా ఆర్యవైశ్యులు ఎంతటి అత్యున్నత మనస్కులో – ఆర్యవైశ్య సంస్థయైన ఆలపాటి కుటుంబీకుల సదరన్ ట్రావెల్, హోటల్ సదరన్ అంతేయని చెప్పాలి. ముఖ్యంగా వీరికి తెలుగువారన్నా, తెలుగు భాషయన్నా ఎనలేని ప్రేమ. ఢిల్లీలో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు జరిగినప్పుడు ఛైర్మన్ ఏ.వి.రావుగారు ప్రత్యేకంగా నాకు ఉత్తరం వ్రాసి, తమ హోటల్ నందు భోజనవసతియేగాకుండా స్థానికంగా తిరగడానికి 'కారు' కూడా ఏర్పాటుచేసారు. ఆంధ్ర మహాసభల ప్రతినిధుల సమావేశాలకు వెళ్ళడానికి తిరిగి వారి వారి బసలు చేరుకోవడానికీ ఏ.సి. బస్సులను ఉచితంగా యిచ్చారు. ఏ తెలుగు కార్యక్రమం జరిగినా వీరు యథోచితంగా ప్రోత్సహిస్తారు. ఓసారి నేనున్నప్పుడే మలేషియా నుంచీ వచ్చిన ఆంధ్ర ప్రతినిధులను ఆహ్వానించి ఉదయ ఫలహారం ఉప్మా, పెసరట్టు, ఇడ్లీ, గారెలతో ఘనంధైన విందు చేసారు.

ఇహ నా విషయంలో వారిది నా పుట్టిల్లు వారి హోటల్‌నే ఓ చక్కని ఏ.సి. డీలక్స్ గది, తిరగడానికి కారూ, ఒకరోజు కృష్ణమోహన్ (అదే రావుగారిల్లు) ఇంటికి వెళ్ళి ఆతిథ్యం అందుకుని రావడం ఆనవాయితీ. ఆ ఆతిథ్యం సామాన్యమైనది కాదు పిండివంటలతో భోజనం పెట్టి, బట్టలు కూడా పెట్టి పంపిస్తారు. కృష్ణమోహన్ భార్యా, పిల్లలు (అంటే రావుగారి కుమారుడు, కోడలు, మనుమలు ఆత్మీయ బంధువుల కన్నా ఆదరంగా అతిథి మర్యాదలు చేస్తారు. రావుగారికీ, కృష్ణమోహన్‌కూ 'ప్రముఖాంధ్ర' అంటే ఎడతెగని అభిమానం. ఇదే పూర్వజన్మ సుకృతమ్. ఏ.వి.రావు, కృష్ణమోహన్, వారి సోదరుని కుటుంబ సభ్యులు ఆచంద్రతారార్కమూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వ్యాపారాభివృద్ధి చెందుతూ తెలుగుదనానికి కీర్తిప్రతిష్టలు తేవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ●

**వై.ఎస్. రాజశేఖర్ బ్రతికి ఉంటే చెన్నయ్‌లో 'ఆంధ్ర భవనం' ఏర్పడి ఉండేది.**
**విశాఖలో తెలుగు మ్యూజియం ఏర్పడడానికి వై.ఎస్సే. కారణం!**

# జి.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

నీవు పవిత్రునిగా వుంటూ నీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నంతకాలం నీకు అపజయం కలగదని గుర్తుంచుకో.

\- స్వామి వివేకానంద



## శ్రీ సీతారామ కళ్యాణ ఉత్సవం

ఏ పనిని చేసినా దాన్ని భగవదర్పితం చెయ్యాలి. త్రికరణశుద్ధిగా చెయ్యాలి. మనస్సును ఆ పనిపై లగ్నం చేసి చెయ్యాలి. చిత్తశుద్ధి లేకుండా ఎన్ని పూజలు చేసినా ఫలితం శూన్యం. అందుకే "చిత్తస్య శుద్ధయే కర్మః" అన్నారు. ఇదంతా ఎందుకంటే మా రామకృష్ణ పాఠశాల పూర్వ తెలుగు విద్యార్థుల కలయిక తరువాత తరచూ ఎవరో ఒకరి ఇంటిలో ఏదో ఒక విశేషంలో కలుసుకుంటూ వున్నాం. అలాటి ఒక సందర్భంలో దామోదర్‌కు శ్రీరామనవమి ఉత్సవాన్ని ఆంధ్ర సాంప్రదాయంలో భద్రాచలంలో వలె శ్రీరామనవమి రోజున సీతారామ కళ్యాణ వైభవాన్ని జరిపించాలని అనుకొని, మా స్నేహితులతో తన కోరికను చెప్పాడు. శ్రీరామనవమి జగత్ కళ్యాణానికి సంకేతం. రామనామమనేది చక్కెర కంటే తీపి, తేనెకన్న కడు రుచియై నది. ఆదర్శ దాంపత్యానికి నిదర్శనం శ్రీసీతారాములు. ఆ దంపతుల కళ్యాణాన్ని తెలుగింటి కళ్యాణంగా జరిపించాలనే కోరిక దామోదరంది. అనుకున్నదే తడవుగా నలుగురయిదుగురు స్నేహితులను సమావేశపరచి శ్రీరామనవమి రోజున సీతారామ కళ్యాణోత్సవాన్ని జరుపాలని నిర్ణయించి ఏర్పాట్లన్నీ వేగవంతం గావించాం. పదిమంది స్నేహితులం వారి కుటుంబ సభ్యులతో సహా కనీసం నాలుగు రోజుల ముందుగా దామోదర్ ఇంటికి వెళ్ళి ప్రతివారు వారివారి ఇంటి కళ్యాణంగా భావించి ఏర్పాట్లన్నీ చేసారు. చివరి రెండురోజులు పగలు, ఇంటినంతా అలంకరించి, రంగు రంగుల ముగ్గులు వేయించి, ఇంటికి అరటి మానులూ, మామిడితోరణాలు, పందిరిని వేయించి శోభాయమానంగా తయారు చేసాం. ఈ పనులన్నీ అందరి స్నేహితుల కుటుంబ సభ్యులు చేసారు. దామోదర్ ఇంటిలో కనీసం 150 మంది కూర్చునే పెద్ద హాలుంది. అందులోనే కళ్యాణ ఏర్పాట్లు చెయ్యడం, మంటపాన్ని ఏర్పాటుచేసి దాన్ని పువ్వులతో అలంకరించటం, బంగారు మంగళసూత్రాలు తయారుచేయించటం, వచ్చిన ఆహుతులందరికీ శ్రీసీతారామ పట్టాభిషేక వెండి డాలర్, తులసిమాల ఏర్పాటుచెయ్యడం, తాంబూల బ్యాగ్‌లు, పూజకు కావలసిన సంచి అందులో అక్షింతలు, కుంకుమ, పసుపు, పువ్వులు, పళ్ళెం, దీపం వగైరాలు 35 జంటలకు ఏర్పాటుచేసి, శ్రీరామనవమి రోజు ఉదయం (భద్రాచలంలో మాదిరి) మంత్రపూర్వకంగా హోమం చేసి, అక్కడినుండి సీతారామ విగ్రహాలను, పెళ్ళిబట్టలు, మంగళసూత్రాలు, పూలమాలలు, పండ్లు, పిండివంటలు, పళ్ళెములతో దామోదర దంపతులు, మా దంపతులం (జీవిరావు), వెంకటరామ గోపాలం దంపతులు, భాస్కర్ దంపతులు, దామోదర అక్కగారు ఆ దంపతులు, ఈ కళ్యాణానికి ప్రత్యేకంగా వచ్చిన దామోదర్ వియ్యాల వారు దంపతులు, క్రికెటర్ అశ్విన్ వారి అత్తమామలు, సుబ్బారావు దంపతులు, అన్నారావు దంపతులు, మోహన మురళీధర్ దంపతులు, శోభన్‌బాబు దంపతులు, అనిల్‌కుమార్ దంపతులు, సత్యపతి దంపతులు, వి.ఎం.కుమార్ దంపతులు,




శ్రీరామునికి బట్టలు సమర్పిస్తున్న దామోదర శకుంతల దంపతులు



సీతమ్మవారికి బట్టలు సమర్పిస్తున్న జీవిరావు, లలిత దంపతులు

రాత్రి ఆ ఇంటిలోనే వుండి పెళ్ళికి కావలసిన పిండివంటలు చెయ్యడం, పువ్వులు మాలలుగా కట్టడం. సీతారాముల విగ్రహాలకు బట్టలు అలంకరించి నగలు అలంకారం చెయ్యడం, పూజకు కావలసిన సామగ్రిని సమకూర్చడం. దామోదరం ఇంకా కె.వెంకటేశ్వరరావు, పాండురంగారావు, విజయకృష్ణ, ఏడిద విశ్వమోహన్ ఒక్కొక్కరు ఒక్కొక్క పళ్ళెంలో పెళ్ళి వస్తువులు తీసుకొని హోమ మండపం నుండి కళ్యాణ మంటపానికి ఊరేగింపుగా బాజా భజంత్రీలతో, మంగళవాయిద్యాలు





కళ్యాణ ఉత్సవంలో సతీసమేతంగా పాల్గొన్న ఆత్మీయ స్నేహితులు



భద్రాచలయాత్రలోని మధుర ఘట్టాలు


వాయిస్తూ, వేదమంత్రాలు వల్లిస్తూ వెంటరాగా కళ్యాణమండపాన్ని చేరుకున్నాం. అక్కడ దామోదర్ అతని భార్య శకుంతల శ్రీరామచంద్రునివైపు వారిగాను, నేను, నా భార్య లలిత సీతమ్మ తల్లివైపు పెళ్ళివారుగాను సమావేశమయ్యి ఆ దివ్యకళ్యాణాన్ని జరిపించాం. అ కళ్యాణ మహోత్సవాన్ని వేదమంత్రయుక్తంగా 5గురు పురోహితులతో ఒకప్రక్క జరుగుతుండగా, మధ్య మధ్యలో రాగయుక్తంగా, నాదంగా ఒక సంగీత గోష్టిని ఏర్పరచి వారిచే కళ్యాణఘట్టాల గీతాలను రాగయుక్తంగా ఆలపించే ఏర్పాట్లు చేసాం. ఆ సీతారాముల కళ్యాణం వేదంతో, నాదాన్ని కూడా జతపరిచి జరిపించి ఆనందించాం. ఒక ఇంటి పెళ్ళిలో ఏమేమి జరుపుతారో అవన్నీ సమకూర్చి నిండుగా ఆ కళ్యాణవైభవాన్ని జరిపించాం. తలంబ్రాలు తంతుకి అక్షింతలేకాక, మంచి ముత్యాలను, కెంపులను కూడా ఏర్పాటుచేసాం. వాటిని తరువాత సీతారాములు ఆదర్శ దాంపత్య ప్రసాదంగా అందరికీ అందించాం. తలంబ్రాల తరువాత సీతారాములకు అందరిచేత హారతి పట్టడం చేయించాం. అదంతా తెనుగుదనమే. తరువాత మాంగల్యధారణ అక్కడ నాకు చదివిన వాల్మీకి రామాయణం గుర్తుకువచ్చింది. శ్రీరామచంద్రుని వద్దకు జనకుడు వచ్చి అగ్నిసమక్షంలో రామునికి ఎదురుగా సీతను నిలబెట్టి."

**ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ**
**ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా**
**పతివ్రతా మహాభాగా ఛాయే నానుగతా సదా.**

"ఓ రామ! ఇదిగో నా కుమార్తె సీత. ఈమె నీకు సహధర్మచారిణి కాగలదు. ఈమెను స్వీకరించి నీ చేతితో ఈమె చేతిని గ్రహించు ఎల్లప్పుడూ నీడలా నిన్నను సరించగలదు" అన్నది. ఆ జనకుని స్థానంలో వుండి సీతమ్మతల్లి తరపున నేనున్నందుకు నా కళ్ళు ఆనందభాష్పాల్లో చెమర్చాయి. (నాకీ అవకాశం కల్పించిన దామోదర్‌కు నా కృతజ్ఞతలు) తెలుగుదనం తొణికిసలాడిన ఈ కళ్యాణంలో విందుభోజనం కూడా తెలుగు సాంప్రదాయం ఉట్టిపడే విధంగానే ఏర్పాట్లు చేసాం. విందు భోజనం తరువాత తాంబూలం ఆరగించి ఆహుతులందరూ సంతోషంతో ఇళ్ళకు వెళ్ళాం. ఆ భద్రాద్రి రాముని వివాహం తిలకించినంత ఆనందంగా వుంది అంటూ స్నేహితులు ఇళ్ళకు వెళ్ళాక ఎస్.ఎం.ఎస్.లు పంపితే అది చూసి ఆనందించాం. ఆ జ్ఞాపకాలు చాలాకాలం అందరి మనస్సులలో అలాగే గుర్తుండిపోతాయి. అందుకేనేమో ఆ భద్రాద్రి రాముడు మమ్మల్నందర్ని కరుణించి, వారం రోజులలో భద్రాచలం బయలేర్దదీశాడు. నేను, మా ఆవిడ, ఇద్దరు పిల్లలు, దామోదర్ దంపతులు, భాస్కర్ దంపతులు, రామ్‌గోపాల్ దంపతులు పిల్లలతో 14 మంది రెండు ఇన్నోవా కార్లలో చెన్నై నుంచి భద్రాచలానికి బయలేర్దరి వెళ్ళాం. ప్రయాణ అలసటలు కాని ఎక్కడ ఏవిధమైన ఒడిదుడుకులు లేకుండా వెళ్ళి ఆ సీతారామ చంద్రులను భద్రాచలంలో దర్శించుకొని తృప్తిపొందాము. మేము వెళ్ళిన సమయం శ్రీరామనవమి ఉత్సవాల ఆఖరిరోజు. సీతారాముల కళ్యాణాన్ని జరిపించిన మాకు శ్రీరామనవమి ఉత్సవాల ఆఖరి రోజున భద్రాద్రి రాముని ఒడిలో కూర్చొన్న సీతమ్మ, ఆ ప్రక్కనే లక్ష్మన్నను దర్శనం చేసుకోవడం పూర్వజన్మసుకృతం. ఆ ఆనందాన్ని మాటలలో వర్ణించలేం.

## మా హనుమయ్య వయసు అరవై

కొంతమందిని పరిచయం చేసేటప్పుడు కలం సంతోషంతో పరుగులు తీస్తూ వుంటుంది. అలాగే మా హనుమంతరావుగారిని గూర్చి నాలుగు ముక్కలు రాద్దామనుకున్నప్పుడు ఒకసారి ఆయనగురించి 400 ముక్కలు స్ఫురణకు వచ్చి బుర్రలోని హార్డ్‌డిస్క్ క్రాష్ అయింది. ఆయన పనిచేసి రిటైర్ అయ్యినది ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో ఉన్నత అధికారిగా. ఆ విమానం ఆకాశంలోకి ఎంత ఎత్తుకు వెళుతుందో అంతటి ఉన్నత మనస్కుడాయన. అందుకేనేమో అందరూ ఆయన్ను హనీ (తేనె) అని పిలుస్తూంటారు. పూర్తి పేరుతో పిలిచేవారు బహు తక్కువ. తేనె ఎంత మధురం. మంచి చేదు మందుని ఇచ్చేటప్పుడు వైద్యులు దానిని తేనెలో కలుపుకొని వేసుకో అంటారు. అంతటి మహిమాన్వితమైనది తేనె. కాబట్టే అందరూ ఆయన్ను హనీ అంటారు. ఉపకారం అంటే ఊర్లొంచి పారిపోయే ఈ రోజుల్లో ఆయన పరిగెత్తు కుంటూ వచ్చి సహాయపడతారు. ఆయన పూర్లో లేకపోయినా ఆ పనిని ముగించగల సమర్థత ఆయనకు వుంది. ఆయన జీవితంలో ఎన్నో చేదు అనుభవాలు చవి చూసినప్పటికీ ఎప్పుడూ తియ్యగానే వుండే తియ్యందనాల మనిషి. భార్య పార్వతి ఈమధ్యే గతించింది. కూతురు విజయలక్ష్మి దుబాయిలో వుంది. ఆయన 60వ పుట్టినరోజని తెలుసుకొని బావ మరుదులు, చెల్లెళ్లు కలిపి ఆయన పుట్టినరోజును పిల్లాపాపలతో ఘనంగా జరిపారు. దీన్నిబట్టి ఆయనంటే అందరికీ ఎంత గౌరవం వుందో తెలుస్తోంది. హనుమంతుడికి ఆయన బలం ఆయనకు తెలీదు. అలాగే మా హనుమంతరావు కూడా అసాధ్యమైన పనులను సాధ్యం చేసుకొని వస్తారు. ఆరేళ్ళ క్రితం మా గురువుగారు విశ్వంజీ గారికి హనుమంతరావుగారిని పరిచయం చేసాను. ఆయన





శ్రీ విశ్వయోగి విశ్వంజీ గారు,గోటేటి శ్రీరామారావు, జీవిరావులతో హనుమంతరావు

సేవాభావం వల్ల ఈరోజు గురువుగారి ప్రియ శిష్యులలో హనుమంతరావుగారు ఒకరు. గురువుగారు ఎప్పుడు చెన్నై వచ్చినా ఆయనకు అన్నీ హనుమయ్యే, అంతగా అంకితభావం గల వ్యక్తి. నాకు తెలిసినంతవరకూ ఆయన్ను అభిమానించేవారు, ఇష్టపడేవారే ఎక్కువగా వున్నారు. ఆయనది ఉన్నతమైన వ్యక్తిత్వం. **పరోపకారార్థమిదం శరీరమ్** అన్న సూక్తికి ప్రత్యక్ష నిదర్శనమే హనుమంతరావు. ఆయన కన్నా చిన్నవాడిని కాబట్టి ఆయన్ను ఆశీర్వదించే వయస్సు లేదు కాబట్టి బలభద్రపాత్రుని వెంకట హనుమంతరావు అలియాస్ హనీగారికి (వరుసకు నాకు అన్నయ్య (తోడల్లుడు) ఆ భగవంతుడు నిండు నూరేళ్ల ఆయుష్షు నివ్వాలని కోరుకుంటున్నాను. ఒక్క మాటలో సత్యసాయిబాబావారు చెప్పినట్టు Be Good, Servicable, Useful, Kind and God Fearing ఇవన్నీ వున్న వ్యక్తి మా హనుమంతరావు.